క్లుప్తంగా

పేదలకు అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: గొందేశి పూర్ణ చంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక బాలాజీ సెంటర్‌లో గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, గొడుగులు అందజేశారు. వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో, వృద్ధాశ్రమాల్లో భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాయుడు ప్రసాద్, సూరంపూడి ప్రకాష్, రెడ్డి ప్రసాద్, ఆడారి నగేష్, సుమన్ పాల్, ఎస్.నగేష్, సుధాకర్, కేతా నాగేశ్వరరావు, ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు నిల్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా జిల్లాలో గత రెండురోజులుగా ఒక్క దరఖాస్తు కూడా పడలేదు. జిల్లాలో 125 మద్యం షాపులకు లైసెన్సుల జారీ నిమిత్తం ఎక్సైజ్‌శాఖ సోమవారం అర్ధరాత్రి దాటాక నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. బుధవారం గాంధీ జయంతి కారణంగా బ్యాంకులకు సెలవు కావడంతో ఒక్క దరఖాస్తు కూడా వ్యాపారులు వేయలేదు. ఈ నెల 9వ తేదీ వరకూ గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఈ నెల 15 వరకూ ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు: దేవీచౌక్‌లో ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఉత్వర్వుల మేరకు ట్రాఫిక్ పోలీసు విభాగం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల కారణంగా దేవీచౌక్ మీదుగా వెళ్లే వాహనాలు పోలీసులు సూచించిన విధంగా రాకపోకలు కొనసాగించాల్సి ఉంది.

- వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండ్‌కు వెళ్లాల్సిన వాహనదారులు చిరంజీవి బస్టాండ్, స్వతంత్ర హాస్పటల్ మీదుగా వెళ్లాలి.
- గోకవరం బస్ స్టాండ్ నుంచి వై.జంక్షన్‌కు వెళ్లాల్సిన వాహనదారులు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి తుమ్మలోవ మీదుగా వెళ్లాలి.
- పేపర్ మిల్ నుంచి జాంపేటకు వెళ్లాల్సిన వాహనదారులు తుమ్మలోవ, కంబాలచెరువు మీదుగా వెళ్లాలి.
- జాంపేట నుంచి పేపర్ మిల్‌కు వెళ్లే వాహనదారులు నందం గనిరాజుసెంటర్, కంబాలచెరువు మీదుగా వెళ్లాలి.
- మెయిన్ రోడ్ నుంచి కంబాలచెరువుకు వెళ్లాల్సిన వాహనదారులు జెండా పంజా రోడ్, జాంపేట మీదుగా వెళ్లాలి.

అన్నప్రసాద వితరణ మహోన్నతమైనది



అన్నప్రసాద వితరణ ప్రారంభించిన కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం సిటీ: అన్నప్రసాద వితరణ కార్యక్రమం మహోన్నతమైనదని కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ సీటీఐ కేశవభట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆవరణలో గణపతి ఆటోవర్కర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవభట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 33 ఏళ్లగా ఆటో కార్మికులు, ఓనర్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు భవిష్యత్‌లో మరింత ఆనందంగా నిర్వహించాలన్నారు. అన్నసమారాధన కార్యక్రమంలో సుమారు 5,000 మందికి వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు మాజీ డిప్యూటీ మేయర్‌బాక్స్, స్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి, యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	దేవర
సూర్యమినీ	సత్యం సుందరం
సూర్యప్యాలెస్	దేవర
శివజ్యోతి	కళింగ
స్వామి	జోకర్
అశోక	దేవర
రాజా	దేవర
ఊర్వశి	సత్యం సుందరం
మేనక	మత్తు వదలరా-2
రంభ	35 చిన్నకథకాదు
కుమారి	దేవర
అప్సర	దేవర
నామవరం	
వీఎస్‌మహల్	దేవర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	దేవర
కడియం	
వెంకటసూర్య	దేవర



లాలాచెరువులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



గాంధీ అక్షరాలుగా ఏర్పడి నివాళులర్పిస్తున్న కడియం హైస్కూలు విద్యార్థులు



జేగురుపాడులో గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న స్టాలిన్ తదితరులు

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్
- వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



తోపుడు బండిపై నిత్యావసరాలతో నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్



గాంధీజీకి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గోకవరం బస్టాండ్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం సాధ్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు లక్షల మంది గ్రామ వలంటీర్లను గాలికి వదిలేశారని, వైన్ షాపులో పనిచేసే 50 వేల మంది పైగా యువకులు రోడ్డున పడ్డారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి అక్కడ పనిచేస్తున్న వేలాదిమంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రోడ్డుపైకి ఈడ్చారన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతుంటే నియంత్రణకు చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలన 100 రోజులు దాటినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీజీ చూపిన మార్గం ప్రజలకు అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని తోపుడు బండిపై నిత్యావసరాలు అమ్ముతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చంద్రబాబుకు బుద్ధి రావాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మహాత్ముని ఆశయాలను మనమంతా కొనసాగించాని డీసీసీబీ మాజీ చైర్మన్, టౌన్ హాల్ జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు పిలుపు నిచ్చారు. బుధవారం గాంధీ జయంతిని నగరంలో టౌన్ హాల్ జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టౌన్ హాల్లో విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిచి టౌన్ హాల్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాల్ రాయుడు, పంతం కొండలరావు, మాజీ కార్పొరేటర్ కూరగంటి సతీష్, టౌన్ హాల్ జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ కార్యవర్గ సభ్యులు జగన్నాథం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: జాతిపిత మహాత్మాగాంధీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. బుధవారం లాలాచెరువులోని మహాత్మాగాంధీ సైకిల్ వర్తకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ శాశ్వత అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌతమి జీవకారుణ్య సంఘంలో రోగులకు, వృద్ధులకు ఆకుల వీర్రాజు చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైకిల్ వ్యాపార సంఘం మాజీ ప్రెసిడెంట్ వెలుగుబంటి వెంకటేశ్వరరావు, సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, సెక్రటరీ పైడిమల్ల శ్రీను, కార్యాలయ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యాంప్రసాద్, మురారి, బోరయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. బొమ్మూరులో మాజీ ఉపసర్పంచ్ కామినిప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి.

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను సాకారం చేద్దామని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, వైస్ ప్రెసిడెంట్ నాగదేవర స్వర్ణ పాపా, జనరల్ సెక్రటరీ పెళ్లూరి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, సీనియర్ మెంబర్ తిడా ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాకా రామ్మోహన్, కోఆప్టెడ్ మెంబర్ మారెం రోశయ్య చంద్ర, సీనియర్ న్యాయవాదులు దాసరి రాంబాబు, ఎంవీవీ సత్యనారాయణ(బుజ్జి), కరుణాకర్ రాజు, జేవీవీ రమణ, కేవీవీ సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్ముని 155వ జయంతి సందర్భంగా విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. గాంధీ పేరు రూపంలో ఏర్పడి మహాత్ముడిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా గాంధీజీ చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రఫీయుద్దీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కడియం: మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని జేగురుపాడులో గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి వీర శివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్(పండు), మద్దుకూరి గోపి, బోడా అచ్యుత్, పుట్టా బుజ్జి, వరసాల నాని, మారిశెట్టి నాగన్న, కారింకి గోవిందు, చంటి, కేశవపల్లి సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రతిఒక్కరూ స్వచ్ఛత, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అధికారులతో పాటు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కార్యాలయ ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు. తొలుత గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీలు వెంకట్రాజు, ఛాయాదేవి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మహాత్మాగాంధి జయంతి వేడుకలను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాషా, డాక్టర్ బాబ్జీ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లిఖార్జున, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భవానీ, కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. గాంధీపురం-2 నగరపాలక సంస్థల ఉన్నత పాఠశాలలో మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

స్వచ్ఛ బొమ్మూరుగా తీర్చిదిద్దుదాం



బొమ్మూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్



కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

- స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరి భాగస్వామ్యంతో గ్రామాన్ని స్వచ్ఛ బొమ్మూరుగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం బొమ్మూరులోని స్వచ్ఛతాహి సేవ ముగింపు సందర్భంగా స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమానికి కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పునఃప్రారంభించారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా తొమ్మిది అంశాల ప్రాతిపదికన చేపట్టిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి భాగస్వామ్యం చేశామన్నారు. తడి చెత్త, పొడి చెత్త విషయంలో ప్రతిఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో గ్రామాలన్నీ జీరో వేస్ట్ విధానంలో పరిశుభ్రత పాటించడంలో వ్యక్తిగత బాధ్యత వహించాలన్నారు. మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ గ్రామానికి ఎన్నికలు నిర్వహించని కారణంగా గ్రాంటులు రాక అభివృద్ధి కుంటుపడిందన్నారు. పుష్కరాల నేపథ్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కోసం కార్యాచరణ రూపొందించామన్నారు. అనంతరం జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించిన పంచాయతీ కార్యదర్శులను, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు, డీఎల్‌పీవోలు ఎం.నాగలత, అమ్మాజీ, మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ డి.బాబూరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

సీటీఆర్ఐ: స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రెవెన్యూ డివిజన్ అధికారి ఆర్.కృష్ణనాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలన్నారు. ఇకపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ఎవరికి వారు స్వీయ నియంత్రణ ద్వారా నిలిపేయాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం, ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో ఆర్డీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ నిర్మాణంలో పునరంకితమవుదాం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వచ్ఛ భారత్ నిర్మాణంలో అందరం పునరంకితమవుదామని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సామాజిక బాధ్యత వహించాలన్నారు. భారతదేశాన్ని రాబోయే రోజుల్లో ఒక పరిశుభ్రమైన దేశంగా ఆవిష్కరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వి.వినూత్న, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిల, డిపో మేనేజర్ ఎస్కే శబ్నం, తహసీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మహోత్సవాలు
- ముస్తాబైన దుర్గాదేవి ఆలయాలు



మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయం వద్ద విద్యుత్ అలంకరణ

రాజమహేంద్రవరం రూరల్: దసరా నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం నుంచి 34వ శరన్నవరాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ గౌరవ అధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తామని ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయంతో పాటు రహదారికి ఇరువైపుల ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంటుంది. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో, బొమ్మూరు జాతీయరహదారి పక్కన కనకదుర్గాదేవి ఆలయంలో, రాజవోలు రోడ్డులోని కనకదుర్గాదేవి ఆలయంలో, నాగదుర్గాదేవి ఆలయంలో, కొంతమూరు బీసీకాలనీలోని దుర్గాదేవి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలోను అమ్మవార్లకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మున్సిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష



దండిమార్చ్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టిన యూటీఎఫ్ ఉపాధ్యాయులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ టీచర్లు యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజమండ్రి దండి మార్చ్ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ ఈ దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారి మాట్లాడుతూ ఎంతోకాలంగా మున్సిపల్ శాఖలో పని చేసే ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు, అప్‌గ్రేడేషన్ వంటి ఎన్నో సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరవైందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రాజమండ్రి యూటీఎఫ్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు గోపి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఏవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వీకుల ఆశీర్వచనాలు లభిస్తాయి



అన్నవితరణ చేస్తున్న శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ

సీటీఆర్ఐ: మహాలయ అమావాస్య రోజున పితృకర్మలను ఆచరిస్తే పూర్వీకుల ఆశీర్వచనాలు లభిస్తాయని గాడాలలో వేంచేసిన మహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామివారి పీఠాధిపతి డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు స్వామిజీ అన్నారు. బుధవారం మహాలయ అమావాస్య చివరి రోజు కావడంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, గోకవరం బస్టాండ్, గోదావరి గట్టు, పుష్కర ఘాట్ వద్ద గల అనాథలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ మహాలయ అమావాస్యతో పితృపక్షాలలో చివరి రోజు పూర్తయ్యిందన్నారు. పితృపక్షాలలో పితృదేవతలు భూమి మీదకి వస్తారన్నారు. వారికి శ్రాద్ధ కర్మలు చేస్తే సంతోషంగా మనల్ని ఆశీర్వదించి మనకు సకల శుభాలను కలగచేసి వెళతారన్నారు. పితృపక్ష కాలాన్ని పెద్దలకు ఎంతో ఇష్టమైన కాలంగా చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్ట్ జాతీయ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్, మద్ది శ్రీనివాస్ రెడ్డి, మజ్జి శ్రీకాంత్, మతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

- నిద్రావస్థలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది



ఆజాద్ చౌక్ సెంటర్‌లో యథేచ్ఛగా సాగుతున్న మాంసాహార విక్రయాలు

రాజమహేంద్రవరం సిటీ: అహింసా వాదాన్ని బోధించిన గాంధీ మహాత్ముని జయంతి రోజున రాజమహేంద్రవరం నగరంలో యథేచ్ఛగా మాంసం విక్రయాలు జరిగాయి. ఏటా అక్టోబర్ 2వ తేదీన మాంస విక్రయాలు జరపరాదనే నిబంధన ఉన్నా నగరంలో ఆజాద్ చౌక్, నాగుల చెరువు బజార్, దానవాయిపేట, క్వారీ సెంటర్, ఆర్యాపురం, పేపరుమిల్లు ఏరియా తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద బహిరంగంగానే మాంసం విక్రయాలు నిర్వహించారు. గాంధీ జయంతి రోజు మాంసాహార విక్రయాలను అరికట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పూర్తి నిద్రావస్థలో ఉండిపోయారు. మరోవైపు మాంసాహార వినియోగం చేయరాదనే నిబంధన ఉన్నా రెస్టారెంట్లలో ఎప్పట్లాగే మాంసాహార వంటకాలను విక్రయించారు. నిబంధనలను అతిక్రమించే వ్యాపారులపై చర్యలు చేపట్టాల్సిన పారిశుధ్య అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై గాంధేయవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఖాదీకి పూర్వ వైభవం తెచ్చేందుకే శారీ వాక్



ఫ్రీడమ్ పార్కు వద్ద ఖాదీ శారీ వాక్ నిర్వహిస్తున్న మహిళలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఖాదీకి పూర్వ వైభవం తెచ్చేందుకే ఖాదీ శారీ వాక్ నిర్వహించినట్లు ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సమితి ఆధ్వర్యంలో ఖాదీ ఉద్యమాన్ని గాంధీజీ ప్రారంభించి 106 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 106 మంది మహిళలతో ఖాదీ శారీ వాక్ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్‌లోని స్వాతంత్ర సమరయోధుల పార్కు నుంచి సరస్వతి ఘాట్‌లోని భారత్ మాత విగ్రహం వరకు ర్యాలీ సాగింది. లేడీస్ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్, లయన్స్ క్లబ్, లైన్ లేడీస్, వాసవి క్లబ్, హరే శ్రీనివాస భక్త బృందం, సరస్వతి గాడ్ మహిళా భక్త బృందానికి చెందిన మహిళలు శారీ వాక్‌లో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రి ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సౌందర్య, లక్ష్మి, మాటూరి మంగతాయారు, రాయపూడి నాగలక్ష్మి, మంచిరాజు హేమలత, ముదునూరి వాణిశ్రీ, కొయ్యాన కుమారి, న్యాయవాది ఆదిలక్ష్మి, బి.ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం, ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన మహాలయ పక్షం సందర్భంగా పితృ తర్పణాలు, పిండ ప్రదానాలు నిర్వహించడం అభినందనీయమని ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుధాకర్ రావు పేర్కొన్నారు. బుధవారం నగరంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థలో సుమారు 100 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు ఎంపీ మురళీధర్ మాట్లాడుతూ 15 రోజుల పాటు స్వరాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కార్యదర్శి గుబ్బల రాంబాబు, జనరల్ సెక్రటరీలు సుబ్రహ్మణ్యం, పప్పు శర్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రరావు, జాయింట్ జనరల్ సెక్రటరీ మస్తాన్, సుబ్రహ్మణ్యం, ఆరేపల్లి సత్యనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.